

రూ.35.80 కోట్లతో పిట్లంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్

• పరిపాలనాపరమైన అనుమతినిచ్చిన ట్రాన్స్‌కో సీఎండీ

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పిట్లంలో రూ.35.80కోట్లతో 132/33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ట్రాన్స్‌కో పరిపాలనాపరమైన అనుమతినిచ్చింది. ఈ మేరకు ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సబ్‌స్టేషన్‌ను రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ) రుణంతో కట్టనున్నారు. 50ఎంవీఏ(మెగావాట్ అంపెరస్) సామర్థ్యంతో 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టనున్నారు. ఆ తర్వాత బాన్సువాడ నుంచి 26.5 కిలోమీటర్ల మేర లైన్లు వేయనున్నారు.

పరిషత్ ఎన్నికలకు.. సన్నద్ధం!



జడ్పీటీసీ కార్యాలయం



ఎంపీటీసీ కార్యాలయం



- వేగంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు
- ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం
- జిల్లాలో పరిషత్ ఓట్లు 6,53,130
- పోలింగ్ కేంద్రాలు 1,286
- 25 జడ్పీటీసీ.. 237 ఎంపీటీసీ స్థానాలు
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి
- రిజర్వేషన్ల వైపు అందరి చూపు

కామారెడ్డి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం చేశారు. బ్యాలెట్ పేపర్‌తో సహా ఏర్పాట్లు జరిగినా ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల కంటే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తారనే చర్చ మొదలైంది. వేగంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఏర్పాట్లు మొదలు పెట్టారు. అందుకు సంబంధించిన ఎన్నికల సామగ్రి కూడా జిల్లాకు పంపించారు. ఓటర్ల జాబితాను సిద్ధం చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి కూడా పంపించారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలో పరిషత్ ఎన్నికల హడావిడి ముందుకు వచ్చింది. జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. గతంలో 22 జడ్పీటీసీ స్థానాలు ఉండగా ఈసారి ఆ సంఖ్య 25 కు చేరింది. 236 స్థానాలు గతంలో ఉండగా ప్రస్తుతం 1 ఎంపీటీసీ స్థానం పెరగడంతో 237కు చేరింది. ఈ స్థానాలకు అనుగుణంగానే పరిషత్ ఎన్నికలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి, అధికారులకు శిక్షణ తరగతులు సైతం చేపట్టారు.

పరిషత్ ఓట్లు 6,53,130

జిల్లాలోని 25 జడ్పీటీసీ, 237 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు తుది ఓటరు జాబితాను రెండు రోజుల క్రితం అధికార యంత్రాంగం ప్రకటించింది. జిల్లాలో మొత్తం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 6,53,130 ఉన్నాయి. ఇందులో మహిళలవి 3,38,941 ఓట్లు ఉండగా పురుషులవి 3,14,173 ఓట్లు ఉన్నాయి. ఇతరులవి 16 ఓట్లు ఉన్నాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటర్లలో మహిళలే అధికంగా ఉన్నారు. పురుషుల కంటే మహిళ ఓట్లు 24,768 ఓట్లు ఉన్నాయి. వీటితో పాటు పోలింగ్ కేంద్రాలను సైతం గుర్తించారు. మొత్తం పోలింగ్ కేంద్రాలు 1286 ఉన్నాయి.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేయాలని ఆయా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పరిషత్ ఎన్నికలకు సంబంధించి సామగ్రిని సైతం జిల్లాలకు పంపింది. ఎన్నికల అధికారులను సిబ్బందిని నియమించాలని ఆదేశించింది. జిల్లాలోని అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు 1286 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఇందుకు అనుగుణంగా పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈనెల 15 వరకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు పూర్తిచేసే దిశగా ఎన్నికల సంఘం ఆదేశాలు ఇవ్వడంతో అధికార యంత్రాంగం చురుకుగా ఏర్పాట్లు చేస్తోంది.

గతంలో రిజర్వేషన్‌లు ఇలా..

2019 ఎన్నికల్లో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రిజర్వేషన్‌లు ఇలా ఉన్నాయి. 22 జడ్పీటీసీ స్థానాల్లో మహిళలకు 11 స్థానాలు రిజర్వ్ కాగా పురుషులకు 11 కేటాయించారు. ఇందులో ఎస్టీలకు 2 కేటాయించగా ఒకటి మహిళ, మరొకటి జనరల్‌గా రిజర్వ్ అయింది. ఎస్సీలకు 4 స్థానాలు కేటాయించగా రెండు మహిళలకు మరో 2 జనరల్‌గా కేటాయించారు. బీసీలకు 5 రిజర్వ్ కాగా ఇందులో 3 మహిళలకు 2 జనరల్‌గా రిజర్వ్ అయ్యాయి. జనరల్‌గా 11 స్థానాలు రిజర్వ్ కాగా మహిళలకు 5, జనరల్‌గా 6 రిజర్వ్ అయ్యాయి. 236 ఎంపీటీసీ స్థానాల్లో 123 మహిళలకు, 113 జనరల్ రిజర్వ్ అయ్యాయి. ఇందులో ఎస్టీలకు 21 స్థానాలు రిజర్వ్ కాగా మహిళలకు 16, జనరల్‌గా 5 రిజర్వ్ అయ్యాయి. ఎస్సీలకు మొత్తం 39 కేటాయించగా ఇందులో 19 మహిళలకు, 20 జనరల్ రిజర్వ్ అయ్యాయి. బీసీలకు మొత్తం 63 స్థానాలు కేటాయించగా ఇందులో మహిళలకు 36 జనరల్ 27 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. జనరల్‌గా 113 స్థానాలు కేటాయించగా 52 మహిళలకు 61 జనరల్‌గా రిజర్వ్ అయ్యాయి. ఎంపీపీ మొత్తం 22 స్థానాలు ఉండగా ఇందులో మహిళలకు 12, జనరల్ 10 రిజర్వ్ అయ్యాయి. ఇందులో ఎస్టీలకు 2 కేటాయించగా మహిళలకు 1, జనరల్‌గా 1 రిజర్వ్ అయ్యాయి. ఎస్సీలకు నాలుగు కేటాయించగా ఇందులో మహిళలకు 2 జనరల్‌గా 2, బీసీలకు మొత్తం 5 కేటాయించగా ఇందులో మహిళలకు 3 జనరల్ 2 రిజర్వ్ అయ్యాయి. అన్ రిజర్వ్‌గా 11 స్థానాలు కేటాయించగా ఇందులో 6 మహిళలకు 5 జనరల్‌గా రిజర్వ్ అయ్యాయి.

కొత్త రిజర్వేషన్లపైనే చర్చ

పరిషత్ ఎన్నికల్లో ఈసారి రిజర్వేషన్ల మార్పు ఈ సారి ఎలా ఉంటుందనే చర్చ కొనసాగుతుంది. జిల్లాలో 25 జడ్పీటీసీ, 237 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. కొత్త స్థానాలు పెరగడంతో రిజర్వేషన్లపై చర్చ కొనసాగుతోంది. రిజర్వేషన్లపై 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు నిబంధనలు ఉన్నాయి. బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామని జనరల్ స్థానాల్లో ప్రాధాన్యత ఉంటుందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఇతర పార్టీలు కూడా బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ ఎన్నికలపై దృష్టిపెట్టిన ఆశావహులు మళ్లీ పరిషత్ ఎన్నికలపై దృష్టి సారించడంపై పల్లెలో సందడి కనిపిస్తోంది.

బర్డ్‌ఫ్లూ.. అప్రమత్తం!

- జిల్లాలోనూ అంతుచిక్కని వైరస్‌తో కోళ్ల మృత్యువాత
- కోళ్లకు వైరస్‌తో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- సలాబత్‌పూర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు
- పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే కోళ్ల వాహనాల తనిఖీ
- 70 శాతం వరకు ఖాళీ అయిన బాయిలర్ కోళ్ల ఫారాలు
- అంతటా తగ్గిన చికెన్ అమ్మకాలు

కామారెడ్డి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కోళ్లకు వైరస్ రావడంతో జనం ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి తెలంగాణ రాష్ట్రంలో బాయిలర్ కోళ్లకు ఈ వైరస్ సోకనప్పటికీ అంతుచిక్కని వైరస్, వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణాలతో కొన్ని కోళ్ల ఫారాల్లో బాయిలర్ కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అదేవిధంగా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూ వైరస్ సోకి కోళ్లు మృతి చెందుతుండడంతో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. పొరుగు రాష్ట్రాల నుంచి బాయిలర్ కోళ్లు జిల్లాలోకి రాకుండా నిఘా పెట్టారు. రాష్ట్ర సరిహద్దు అయిన సలాబత్‌పూర్ వద్ద పశు సంవర్ధకశాఖ, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి కోళ్ల రవాణా చేసే వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని కోళ్ల పరిశ్రమ యజమానులతో పశు సంవర్ధకశాఖ అధికారులు సమీక్షలు నిర్వహిస్తూ ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు.

సలాబత్‌పూర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు

కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతుండడంతో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు అయిన సలాబత్ పూర్ వద్ద ప్రత్యేక చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పశు సంవర్ధకశాఖ వైద్యులతో పాటు ప్యారా అధికారులను నియమించారు. వీరు మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ వచ్చిందా లేదా అనే వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారు. సంబంధిత ఫాంల నుంచి వచ్చేటప్పుడు ధ్రువపత్రాలు ఉంటేనే జిల్లాలోకి అనుమతి ఇస్తున్నారు.

కోళ్ల ఫారాలను తనిఖీ చేస్తున్న పశు సంవర్ధకశాఖ

జిల్లాలోనూ అంతుచిక్కని వైరస్, వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా పలు కోళ్ల ఫారాల్లో బాయిలర్ కోళ్లు మృతి చెందుతున్నాయి. బీర్కూర్‌లోని కిష్టాపూర్ గ్రామంలో ఓ కోళ్ల ఫారంలో సుమారు 4 వేల వరకు వారం రోజుల కిందట కోళ్లు మృతి చెందిన విషయం తెలిసిందే. రెండు రోజుల కిందట బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో మరో కోళ్ల ఫారంలో బాయిలర్ కోళ్లు మృతి చెందాయి. దీంతో జిల్లా పశు సంవర్ధకశాఖ అప్రమత్తమై జిల్లా వ్యాప్తంగా ఉన్న కోళ్ల ఫారాలను తనిఖీలు చేసి రైతులను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 263 బాయిలర్ కోళ్ల ఫారాలు ఉండగా 41 లేయర్ కోళ్ల ఫారాలు ఉన్నాయి. వైరస్ ఎఫెక్ట్‌తో ఆయా కోళ్ల ఫారాల యజమానులు ఇప్పటికే కోళ్లను అమ్ముతున్నారు. వైరస్ సోకుతుండడంతో డీలర్లు సైతం కోళ్లను కొనుగోలు చేయడం లేదని బాధిత రైతులు చెబుతున్నారు. దీంతో జిల్లాలో 70 శాతం వరకు కోళ్ల ఫారాలు ఖాళీ అయ్యాయి.

వైరస్ ఎఫెక్ట్‌తో తగ్గిన ధరలు

వైరస్ ప్రభావం చికెన్ విక్రయాలపై పడింది. గతంతో పోలిస్తే రెండు, మూడు రోజుల నుంచి జిల్లాలో చికెన్ విక్రయాలు చాలా తగ్గినట్లు చికెన్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం శుభకార్యాల సమయం కావడంతో వినియోగం పెరగాల్సి ఉన్నా 40 శాతం మేర తగ్గిందని వారు పేర్కొంటున్నారు. ఒక కిలో కోడిని రూ.110 చొప్పున రైతులు విక్రయిస్తే కనీసం పెట్టుబడి వస్తుందని కానీ ఇప్పుడు రూ.80 వరకే ఇస్తున్నామని రైతులు చెబుతున్నారు. గత వారం రోజుల కిందట స్కిన్‌లెస్ చికెన్ కేజీ ధర రూ.210 నుంచి రూ.260వరకు పలుకగా ఇప్పుడు రూ.110 నుంచి రూ.130 వరకే విక్రయిస్తున్నారు. అలాగే స్కిన్‌తో నైతే రూ.80 నుంచి రూ.100కు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని చికెన్‌షాపుల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదు

• సంజయ్‌కుమార్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

మహారాష్ట్రలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకుతుండడంతో జిల్లాలోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు అయిన సలాబత్‌పూర్ వద్ద ప్రత్యేక చెక్‌పోస్టును ఏర్పాటు చేశాం. వైద్య బృందాలను సైతం నియమించాం. ప్రస్తుతం జిల్లాలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలు లేవు. వాతావరణంలో వస్తున్న మార్పులు, ఎండల తీవ్రతకు కోళ్లు మృతి చెందుతున్నాయి. ఫాం యజమానులతో సమావేశాలు నిర్వహించాం. కోళ్లు మరణిస్తే వాటికి సంబంధించిన శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఎల్లారెడ్డి పాఠశాలలో విద్యార్థులకు భోజనం పెడుతున్న దృశ్యం



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం పాఠశాలలోనే అధికారులు మధ్యాహ్న భోజనం పెట్టారు. 'మధ్యాహ్న భోజనం తినాలంటే కిలో మీటరు నడవాల్సిందే' అని 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను నియమించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలో వండి పెంటారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

సిద్ధరామేశ్వర ఆలయానికి శివస్వాముల పాదయాత్ర

భిక్కనూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయానికి దోమకొండకు చెందిన శివస్వాములు బుధవారం పాదయాత్రగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పాదయాత్రగా ఆలయానికి చేరుకున్న శివస్వాములు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం దోమకొండలో పెద్దఎత్తున శివమాలలను వేసుకున్నారు. ప్రతిఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు హరీష్, దినేష్, రాంచరణ్, రాజేష్, భానుప్రసాద్, నర్సింలు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న శివస్వాములు

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే పంచాయతీ, వార్డుల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. ఆయన బుధవారం ఎల్లారెడ్డి మండలంలోని మీసన్‌పల్లిలో నిర్వహించిన ఆర్‌వోల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పూర్తి బాధ్యత ఆర్‌వోలు, ఏఆర్‌వోలదేనని ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని ఆయన హెచ్చరించారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికతో పాటు ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించాలని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఆయన ఆర్‌వోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి మండలాలకు చెందిన ఆర్‌వోలు, ఏఆర్‌వోలతో పాటు లింగంపేట ఎంపీడీవో నరేష్, ఎల్లారెడ్డి లక్ష్మి, నాగిరెడ్డిపేట ఎంపీడీవో చారి, ఎంపీవోలు మలహరి, ప్రకాశ్, ఎంఈవో వెంకటేశంలు ఉన్నారు.



ఎల్లారెడ్డిలో పంచాయతీ ఎన్నికలపై ఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో



ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న దృశ్యం

వివరాలు 7వ పేజీలో..

కన్నుల పండువగా సీతారాముల రథోత్సవం

- నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి రామాలయంలో రథ ప్రతిష్ఠ, హోమ కార్యక్రమాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- రామనామ స్మరణతో మార్మోగిన ప్రధాన వీధులు
- నేడు వన విహారం



రేపు రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలో శుక్రవారం కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ఇందులో ఎంపికైన వారు ఈనెల 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి 34వ సబ్ జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 55కిలోల లోపల బరువు ఉండాలని తెలిపారు. ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. మిగిలిన వివరాలకు 93985 71110 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థుల ఆధార్, అపార్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

• డీఈవో రాజు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ నెంబర్, అపార్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఈవో రాజు అన్నారు. ఆయన బుధవారం ఎల్లారెడ్డిలో ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూడైస్‌లోని ఖాళీలను పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు. అనంతరం ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థు లకు పలు సూచనలు చేశారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షల పట్ల అధైర్యపడవద్దని ఆయన తెలిపారు. పరీక్షలను ధైర్యంగా రాయాలని ఆయన సూచించారు. ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో వచ్చిన మార్పు లను వివరించారు. 24 పేజీల బుక్‌లెట్ ఉంటుందని, పరీక్షల్లో గ్రేడింగ్ ఉండదని, మొత్తం 100 మార్కులకు గాను 80 మార్కులు పరీక్షకు, 20 మార్కులు ఇంటర్నల్‌కు ఉంటాయని ఆయన తెలిపారు. మొత్తం 6 సబ్జెక్టులకు 7 పరీక్షలు ఉంటాయని ఈ సంవత్సరం 10వ తరగతి మార్కుల మెమోలో పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశం, ప్రత్యేక అధికారి వీణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌లతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
కామారెడ్డి - ఎల్లారెడ్డి
90322 16482
అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్: 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

మామిడిపల్లిలో ఘనంగా మల్లన్న జాతర



మామిడిపల్లిలో మల్లన్నస్వామి షిడేను లాగుతున్న భక్తులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ముజ్గిగె మల్లన్న జాతరను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మల్లన్నస్వామికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథం(షిడే)ను ఆలయం, గుట్ట చుట్టు ఊరేగించారు. రథోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రదక్షిణాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాబివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాస్, రవి, లక్ష్మణ్, రాజన్న, సాజిద్‌గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నీటమునిగి ఒకరి మృతి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల బొబ్బిలి చెరువులో ప్రమాదవశాత్తు ఒకరు నీటమునిగి మృతిచెందినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చెట్లపల్లి రాజశేఖర్ బొబ్బిలి చెరువులో చేపటు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు




ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

దోమకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం 30వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, అఖండ దీపారాధన, స్వామివారి అభిషేకం, అలంకరణ, 31 గురువారం స్వామివారికి ఫల పంచామృత అభిషేకం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు సాయిబాబా వారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కొలిప్యాక్‌లో ఆనందగిరి లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శ్రీ ఆనందగిరి లక్ష్మీనర్సింహస్వామి జాతర, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం ఆలయంలో స్వామివారి రథోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి పాల్గొని భక్తులతో కలిసి రథాన్ని లాగారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం స్వామివారి చక్రతీర్థం జరగనుంది. ఈ ఉత్సవాల్లో మాజీఎంపీపీ దీకొండ హరిత శ్రీనివాస్, మాజీసర్పంచ్ బాలయ్య, మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ మామిడి బాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో బుధవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి జన్మదిన వేడు కలను మండల కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జైడి చిన్నారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు,యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పారి వినోద్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, మండల మైనారిటీ అధ్యక్షుడు అక్బర్, మాజీ వైస్‌ఎంపీపీ జితేందర్ నాయక్, మాజీసర్పంచ్‌లు కిషన్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కొలిప్యాక్‌లో రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు

ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు



1104యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ 1104యూనియన్ నాయకులు బుధవారం ప్లాటినం జూబ్లి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎం.సంజీవ్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1104 యూనియన్ 75ఏళ్లు పూర్తి చేసుకున్న కార్మికులకు అండగా నిలబడిందని, అనంతరం నూతనంగా ఏర్పడిన డిచ్‌పల్లి డివిజన్‌కు ఉద్యోగ కార్మికులను బైఫర్‌కేషన్ చేయడంలో కాలయాపన అవుతుందని, డివిజన్‌లో క్యాడర్‌వైజ్ సీనియరిటీ లిస్టులను సరి చేయడంలో జాప్యం జరుగుతున్న కారణంగా డివిజన్ కార్యాలయం ముందు ప్లేకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్పెషల్ కమిటీ ఛైర్మన్ ఏవో శ్రీనివాస్ నిరసన వ్యక్తం చేస్తున్న నాయకుల వద్దకు వచ్చి నెల రోజుల్లో సీనియరిటీ లిస్టలన్ని సరి చేసి డిచ్‌పల్లి డివిజన్ ఉద్యోగులకు బైఫర్‌కేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి కె.నరేందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

● వేల్పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ జెండా ఆవిష్కరించిన విద్యుత్ కార్మికులు

వేల్పూర్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధ వారం విద్యుత్ కార్మికులకు జెండాను ఆవిష్కరించి నినాదాలు చేశారు. విద్యుత్ కార్మికుల 1104యూనియన్ 75ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యుత్ కార్మికుల జెండాను ఎగురవేశారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటు కార్మికులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ఐ గోపాలస్వామి రాజు, భూపతి, ఖలీద్, నాగరాజు, సందీప్, అశోక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

17న పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన పోటీలు

ముప్కాల్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా ఈనెల 17న అల్లకొండ ఖిల్లా సందర్శన ఉంటుందని అల్లకొండ ఖిలా పరిరక్షణ సమితి అధ్యక్షుడు బూసం సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు బ్రహ్మరౌతు నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్‌షాప్‌లో భాగంగా నేను నా ఊరు మా వంశవృక్షంలో మా కుటుంబం అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఈనెల 17న ఉదయం 11గంటలకు స్థానిక శాంభవి హైస్కూల్ ఆవరణలో క్విజ్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలను అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి నేషనల్ యూత్ ప్రాజెక్టు, యునైటెడ్ నేషనల్ ఆఫ్ యూత్ ఆర్గనైజేషన్, దక్షిణ అసియా మైత్రి సదస్సు సంయుక్తంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ పోటీల్లో గెలుపందిన విద్యార్థులను అల్లకొండ ఊరు ఉద్భవం - ఐదు ఆలయాలకు ప్రసిద్ధి పుస్తకానలు బహుకరించి, మూడు పోటీల్లో ఎక్కువ బహుమతులు గెలుపొందిన పాఠశాల, కళాశాలల్లో ఓవర్ ఆల్ చాంపియన్‌షిప్, షీల్డ్‌ను బముకరిస్తారని తెలిపారు. పాఠశాల నుంచి జూనియర్, సీనియర్ విభాగంలో నలుగురు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనేలా చూడానలి వారు తెలిపారు. ఇతర వివరాలకు 9666759297 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కళాశాల హాస్టల్‌ను సందర్శించిన కమిషనర్



విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు చీమన్‌పల్లి సాంఘిక సంక్షేమ గిరిజన బాలుర కళాశాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజు సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి రాబోయే పరీక్షలకు సన్నద్ధం కావాలని,వందశాతం మార్కులు వచ్చే విధంగా ప్రతీఒక్కరు ఇష్టపడి చదవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, తది తరులు ఉన్నారు.

మోర్తాడ్ డిగ్రీ కళాశాలలో డీట్‌పై అవగాహన

మోర్తాడ్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం డిట్ డిజిటల్ ఎంప్లాయిాట్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ ఉద్యోగ అవగాహన సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ టి.పెద్దన్న ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలోని యువతకు నైపుణ్యం, శిక్షణ సమాచారం ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం కోసం డిట్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ నేతృత్వంలో పరిశ్రమలు, వాణిజ్యశాఖ ద్వారా నోటిఫికేషన్ ఇంటర్న్‌షిప్, అప్రెంటిషిప్ ఉద్యోగ సమాచారం డిట్ అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఆప్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నమోదు చేయడం గురించి కళాశాల డిట్ కోఆర్డినేటర్ అశోక్ శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థులు నేరుగా డిట్ యాప్ ద్వారా ఉద్యోగ అవకాశాలు ఏలా పొందవచ్చునని వైస్‌ప్రిన్సిపాల్ మగ్గిపల్లి భూపతి వివరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు రాజయ్య, డాక్టర్ పి.పూల, డాక్టర్ ఎం.అవంతి, డాక్టర్ పి.అర్చన, ఎం.స్రవంతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్ డిగ్రీ కళాశాలలో కార్యశాల

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో ఒక రోజు కార్యాశాల నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక తెలిపారు. విద్యార్థులకు ప్రాజెక్టు రిపోర్టు ప్రిపరేషన్ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుజాత, ప్రొఫెసర్‌లు వజీరబాను, అధ్యాపకులు స్వప్న, రజిత, సుమయ్య మస్తాక్, సంధ్యవాణి, తదితరులు పాల్గొన్నారు.

సుంకెట్‌లో మహిళ అదృశ్యం

మోర్తాడ్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట్ గ్రామానికి గుమ్మిర్యాల లత(55) అదృశ్యమైందని ఎస్సై విక్రం తెలిపారు. మంగళవారం ఉదయం 8గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, ఆమె కొడుకు గుమ్మిర్యాల సంపత్ ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కలిగోట్‌లో క్రికెట్ టోర్నీ ప్రారంభం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగోట్ గ్రామంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై సీహెచ్.తిరుపతి ప్రారంభించారు. యువత క్రమశిక్షణతో మంచి మార్గంలో నడవాలని అన్నారు. యువతకు క్రీడలతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని,. యువత మంచి మార్గంలో నడిచినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని ఎస్సై అన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మి నర్సింహస్వామి రథోత్సవం



స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

ఎడపల్లి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మి నర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ పూజారులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించి, స్వామి వారి విగ్రహ మూర్తులను పల్లకిలో తీసుకు వచ్చి రథంలో ఉంచి రథాన్ని ఆలయ ప్రాంగణంలోని పరిసరాలలో తిప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా మహారాష్ట్ర నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భక్తులుకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. బ్రహోత్సవాలలో ఎలాంటి అవాంఛనాయ సంఘటనలు జరుగకుండా ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని సాలూర క్యాంప్ గ్రామంలో బుధవారం శ్రీ లక్ష్మి తిరుపతమ్మ సమేత శ్రీ గోపాయార్యా స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంత సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు, వేద పండితులు వెంకటేష్ శర్మ, గ్రామస్థులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● 17న అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవీపేట,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్‌లో ఈ నెల 17న అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం నిర్మించి 5సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చండి యాగం, సామూహిక లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

● దూదిగాంలో ఘనంగా మల్లికార్జున స్వామి ఉత్సవాలు

మెండోర, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలో దూదిగాం గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి ఉత్సవాలను ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారి కళ్యాణం, పల్లకిసేవ, బోనాలు, కోడె మొక్కులు, తులాబారం, రథయాత్ర ఘనంగా నిర్వహించారు. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రథయాత్రలో భక్తులు మంగళహారతులతో ఊరేగింపులో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న 10 సెల్‌ఫోన్ల అప్పగింత

బోధన్‌రూరల్,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న పదిమంది బాధితులకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను రికవరీ చేసి అప్పజెప్పారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ప్రజలు నిత్యం వాడే సెల్‌ఫోన్‌లను భద్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థిని ఎంపిక



సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని శ్రీవర్షిణిని అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): జాతీయ సాఫ్ట్‌బాల్ అండర్-14 పోటీలకు మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని చిక్కల శ్రీవర్షిణి ఎంపికైనట్లు బుధవారం వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ తెలిపారు. మహరాష్ట్రలోని సాంబా జినగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఈనెల 13నుంచి 16వ తేదీ వరకు జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని శ్రీవర్షిణి పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని శ్రీవర్షిణి ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, కృష్ణ, మాలతి, ఓ.ఎస్.శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వేల్పూర్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం కోమన్‌పల్లి గ్రామానికి చెందిన మెరుగు మల్లయ్య అనే వ్యక్తి చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. జనవరి 13వ తేదీన బైక్‌పై వేల్పూర్ నుంచి కోమన్‌పల్లి వస్తుండగా వేల్పూర్ రామ్‌మందిర్ వద్ద కుక్క రావడంతో అదుపు తప్పి బైక్‌పై నుంచి కింద పడిపోయాడు దీంతో ఆయన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మెరుగు మల్లయ్య మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కందకుర్తి గోదావరిలో ఒకరి గల్లంతు

రెంజల్,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమం వద్ద స్నానం చేయడానికి వెళ్లిన ఒకరు గల్లంతు అయినట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి గ్రామానికి చెందిన సాయిబాబా, మక్కయ్యలు ఇద్దరు కందకుర్తి గోదావరి నదికి స్నానం ఆచరించడానికి వచ్చి గోదావరి నదిలోకి దిగగా మక్కయ్య మాత్రమే బయటకు రావడంతో ఈత రాక సాయిబాబా గల్లంతు అయినట్లు ఆయన తెలిపారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాయిబాబా భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భీమ్‌గల్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రానికి చెందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం కాంగ్రెస నాయకులు పంపిణీ చేశారు. వివిధ కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందిన సీఎం సహయనిధికి దరఖాస్తు చేసుకోగా వారికి బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు స్వామి, నర్సయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు అనంత్‌రావు, మల్లెల లక్ష్మణ్, సుంకరి సురేష్, సాయిబాబా, మండల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద స్థలాల పరిశీలన



జక్రాన్‌పల్లిలో ప్రమాద స్థలాలను పరిశీలిస్తున్న నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలో 44వ జాతీయ రహదారిపై తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాద స్థలాలను నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, స్థానిక ఎస్సై సీహెచ్.తిరుపతి, అధికారులు పరిశీలించారు. బుధవారం జాతీయరహదారిపై జక్రాన్‌పల్లి, పడకల్, సికిం ద్రాపూర్, బాలానగర్, అర్గుల్, బ్రహ్మణ్‌పల్లియానం వద్ద జాతీయరహదారిపై రోడ్డు ప్రమాద స్థలాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హైవే పోలీసులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రావిదాస్ వేడుకలు



ముప్కాల్‌లో సంత్ రవిదాస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మోచిసంఘ సభ్యులు

ముప్కాల్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలో మోచి సంఘం ఆధ్వర్యంలో బుధవారం మోచిల ఆరాధ్యదైవం గురుసంత్ రవిదాస్ 648వ జయంతి వేడుకలు నిర్వహించారు. సంత్ రవిదాస్ భక్తి ఉద్యమాన్ని, సమరసత భావాన్ని చాటిచెప్పారని, సంత్ శిరోమణి గురు రవిదాస్ మహరాజ్ అని ఆయన చూసిన మార్గంలో అనుసరణీయమని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సైతం సంత్ రవిదాస్‌ను అనుసరించినట్లు చరిత్ర చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోశెట్టి, కిరణ్‌కుమార్, గంగారాం, దిలిప్, ప్రవీన్, సందీప్, పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం సద్గురు శ్రీ సంత్ రవిదాస్ మహరాజ్ 648వ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోచీ సంఘం రాకాసిపేట్ అధ్యక్షులు కొండ్లెపు సాయిలు మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, అంటరాని తనం తీవ్రంగా ఉన్న రోజుల్లో తన భక్తి గీతాల ద్వారా తన సాహిత్యాల వల్ల ఎవరినైనా ప్రశ్నించవచ్చన్న ధైర్యాన్ని ప్రజల్లో నింపినటువంటి ఆధ్యాత్మిక వేత్త శ్రీ జద్గురు రవిదాస్ మహరాజ్ అన్నారు. మోచీ కులస్తుల గురువైనందుకు గర్వంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ మోచీ సంఘం అధ్యక్షులు సింధి విజయ్, నాయకులు వివేక్, పవన్, లింగయ్య, సాయిలు, ప్రేమ్ కుమార్, సింగయ్య, లింగేష్‌లతో ప్రవీణ్, నాగేష్, శేఖర్, మోచీ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, పెండింగ్ డీఏలను ప్రకటించాలి

భీమ్‌గల్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ ప్రకటించి పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు జాన్‌విల్సన్, ప్రధానకార్యదర్శి గట్టు ఈశ్వర్ కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడంలో ప్రభుత్వం ఆలసత్వం చేస్తుందని, గత రెండేళ్ళుగా పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందక తీవ్ర మానసిక ఆందోళన గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

కమ్మర్‌పల్లిలో పీడీఎస్ బియ్యం పట్టివేత

కమ్మర్‌పల్లి ఫిబ్రవరి 12:(ఆంధ్రజ్యోతి)కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కొండపల్లి లక్ష్మణ్ అనేవ్యక్తి తనఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. తమకందిన పక్కాసమాచారం మేరకు అతనిఇంటిపై దాడిచేయగా 7బస్తాల (5.20క్వింటాళ్లు) బియ్య నిలువఉంచగా మండల రెవెన్యూ అధికారి సతీష్ ఆధ్వర్యంలో పంచినామ జరిపి కేసునమోదు చేసినట్లు తెలిపారు. కాగా స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను భద్రత నిమిత్తం వెంకటేశ్వర రైస్ మిల్లుకు తరలించినట్లు తెలిపారు.

ముగ్గురు వ్యక్తుల బైండోవర్

నవీపేట,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మండలం మల్కాపూర్(ఏ)కు చెందిన ముగ్గురు వ్యక్తులను బుధవారం తహసీల్దార్ వెంకట రమణ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. గ్రామంలో ఈ ముగ్గురు వ్యక్తులు తరుచుగా అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారని అన్నారు. అక్రమ మొరం తవ్వకాలు చేపట్టడం చట్టరీత్యా నేరం కావడంతో వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ముప్కాల్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలం వెంపల్లి గ్రామ శివారులోని నేషనల్ రహదారిపై బుధవారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు(55) అక్కడికక్కడే మృతి చెందాడు. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం నేషనల్ రహదారిపై వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిపై తెల్ల చొక్క లుంగి ఉన్నాయని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. సంబంధిత వివరాల కోసం ముప్కాల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నవీపేట,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాసర రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. నిజామాబాద్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ రావు పని నిమిత్తం మండలంలోని మట్టయ్య ఫారంకు వెళ్లి తిరిగి నిజామాబాద్ వెళ్తుండగా ఎదురుగా నడుచుకుంటూ వస్తున్న కైసర్ ఖాన్ అనే వ్యక్తిని బైక్ ఢీకొందని అన్నారు.ఈప్రమాదంలో బైక్‌పై ఉన్న శ్రీనివాస్ రావుకు తలకు తీవ్ర గాయాలు కాగా నడుచుకుంటూ వెళ్తున్న కైసర్ ఖాన్ కాలికి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు.బాధితుడు శ్రీనివాస్ రావుకు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స అందించగా కైసర్ ఖాన్‌ను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని స్థానికులు వివరించారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

దోమల బారి నుంచి పశువులకు రక్షణ

నవీపేట,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): దోమల బారి నుంచి మనం వివిధ మార్గాల ద్వారా రక్షణ పొందుతుంటాం. ముఖ్యంగా ఫ్యాన్లు, దోమల నివారణ కాయిల్స్, దోమ తెరలను ఏర్పాటు చేసుకోవడం పరిపాటి. సాయంత్రం వేళ నుండి రాత్రి వరకు పశువులు సైతం దోమలు, గుడ్డి ఈగల బారిన పడి అనారోగ్యం పాలవుతుంటాయి. పైగా వీటి బారిన పడి పాల దిగుబడి సైతం తగ్గిపోతుంది. దోమల నుండి పశువుల సంరక్షణకు మండలంలోని లింగాపూర్‌కు చెందిన కోరే గంగాధర్ అనే రైతు తనకున్న మూడు ఆవుల సంరక్షణకు మూడు దోమ తెరలను ఆన్‌లైన్‌లో తెప్పించాడు. సాయంత్రం వేళ ఒక్కొక్క ఆవుకు ఒక్కొక్క దోమ తెరను ఏర్పాటు చేసి వాటిని సంరక్షిస్తున్నాడు.



లింగాపూర్‌లో ఆవుకు దోమ తెర ఏర్పాటు చేసిన దృశ్యం

ఫటా..ఫట్...

శాంతిభద్రతలకు పరిరక్షణకు చర్యలు

● సత్యనారాయణగౌడ్, సీఐ , భీమ్‌గల్



ఆంధ్రజ్యోతి: శాంతిభద్రతల పరిరక్షణకు ఏలాంటి చర్యలు చేపట్టనున్నారు?

సీఐ: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ద్వారా నిరంతరం కృషి చేస్తాం. ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ తగు చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు ఏలాంటి ఆదేశాలను అందజేస్తారు?

సీఐ: గ్రామాల్లో వీడీసీలు, ప్రజా సంఘాలు గాని సివిల్ పంచాయతీలలో తలదూర్చి చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దని అలాగే ప్రజలు ఏదైన అపద వస్తే పోలీసులను సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి: ఆన్‌లైన్ మోసాలు పట్ల ప్రజలను ఏలా అప్రమత్తం చేస్తున్నారు?

సీఐ: ప్రస్తుతం ఇక్కడ ఒక చోట ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వారి బారిన పడి నష్టపోకుండా ముందస్తుగా అపరిచితుల వ్యక్తుల వద్ద నుంచి ఫోన్‌కాల్స్ వచ్చి ఓటీపీ నెంబర్ చెప్పమని అడిగినప్పుడు ఇలాంటి సమాచారం అందించకూడదని, వెంటనే పోలీస్‌స్టేషన్‌లోని గాని, 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాద నివారణకు ఏలాంటి జాగ్రత్తలు చేపడుతున్నారు?

సీఐ: రోడ్డు ప్రమాద నివారణ కోసం వాహనదారులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాము. ఇందుకు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తల్లిదండ్రులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తున్నాము. దీంతో పాటు ప్రాతినిధ్యం స్థానిక ఎస్సై ఆధ్వర్యంలో వాహన తనిఖీ చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: మత్తుపదార్థాల నిరోదానికి ఏలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: మత్తుపదార్థాలు కలిగి ఉంటే కచ్చితంగా కేసులు నమోదు చేస్తాం. అలాగే మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను యువతకు, విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. దీంతో పాటు మహిళల రక్షణ కోసం షీటీం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశాం.

● (ఆంధ్రజ్యోతి, భీమ్‌గల్)

సిరులు కురిపిస్తున్న మొక్కజొన్న

కృషి

» ఎర్రజొన్నకు ప్రత్యామ్నాయంగా సీడ్ మొక్కజొన్న సాగు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు సీడ్ మొక్కజొన్న సిరులు కురిపిస్తోంది. గత కొంతకాలంగా ఆర్మూర్ ప్రాంతంలో హైబ్రిడ్ మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగింది. దీంతో పాటు గత ఏడాది నుంచి సీడ్ మొక్కజొన్న సాగులో ఎక్కువవుతోంది. ఆర్మూర్ రైతాంగానికి అచ్చివచ్చిన పంట ఎర్రజొన్న. ఎర్రజొన్నల సాగుకు ఆర్మూర్ ప్రాంతం ప్రసిద్ధి. ఎర్రజొన్న సాగులో రైతులు కొన్ని సార్లు ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. గత సంవత్సరం ఎర్రజొన్నకు మంచి ధర వచ్చినప్పటికీ ఈ సారి సాగు విస్తీర్ణం తగ్గింది. ఎర్రజొన్న పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు హైబ్రిడ్ మొక్కజొన్న, సీడ్ మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఎర్రజొన్న పంటతో పోల్చుకుంటే సీడ్ మొక్కజొన్న అధిక లాభాలను తెచ్చిపెడుతోంది. దీంతో కొన్ని మండలాల్లో సీడ్ మొక్కజొన్న వైపు రైతులు దృష్టి సారించారు. ఆర్మూర్ పాత మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేస్తున్నారు.

అధిక దిగుబడులు

సీడ్ మొక్కజొన్న ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి (కంకితో సహా తూకం) వస్తోంది. విత్తన వ్యాపారులు క్వింటాలుకు రూ.3600చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. విత్తం ఇచ్చే సమయంలో వ్యాపారులు గ్యారంటి ఇవ్వడం రైతులకు ఎంతో కొంత మేలు చేస్తోంది. ఎకరాన 25 క్వింటాళ్ల దిగుబడి గ్యారంటి ఇస్తున్నారు. ఇందులో పూర్తి విస్తీర్ణంలో 50 శాతం వరకు రైతులకు తక్కువ దిగుబడి వస్తే 25 క్వింటాళ్ల డబ్బులు చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. 50 శాతానికి పైగా దిగుబడులు బాగా వస్తే గ్యారంటి వర్తించదు. దీంతో పాటు సీడ్ కాస్ట్ ఉచితంగా అందజేస్తూ ఎకరాన ఎనిమిది కిలోల రసాయన గుళికలను అందజేస్తున్నారు.



ఆర్మూర్ ప్రాంతంలో సాగు చేస్తున్న ఎర్రజొన్న పంట

ఎకరానికి లక్షకు పైగా ఆదాయం

సీడ్ మొక్క సాగులో రైతులకు ఎకరానికి రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుండడంతో రైతులు మొక్కజొన్న సాగువైపు మక్కువ చూపిస్తున్నారు. గత సంవత్సరం ఆలూర్, తదితర గ్రామాల్లో కొందరి రైతులకు ఎకరాన రూ.లక్ష 20వేల నుంచి లక్ష 30వేల వరకు ఆదాయం రావడం విశేషం. కనిష్ఠంగా రూ.90 వేలు, గరిష్ఠంగా రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. సీడ్ మక్క సాగులో నీటి తడులు కొద్దిగా ఎక్కువే అయినప్పటికీ రైతులు ఈ పంట సాగు వైపే మొగ్గుచూపుతున్నారు. పెట్టుబడులు ఎకరాకు సుమారు రూ.20 నుంచి రూ.25వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది.



దేగాంలో సాగు చేస్తున్న సీడ్ మొక్కజొన్న పంట

ఎర్రజొన్న ప్రత్యామ్నాయంగా

సాంప్రదాయంగా సాగు చేస్తున్న ఎర్రజొన్న పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు సీడ్ మొక్కజొన్నను ఎంచుకుంటున్నారు. గత సంవత్సరం ఆర్మూర్ మండలంలో సుమారు 8వేల ఎకరాల్లో ఎర్రజొన్న పంట సాగు కాగా ఈ సారి 5500 ఎకరాలకు పరిమితమైంది. ఎర్రజొన్న సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ ఆశించిన స్థాయిలో ధర రావడంలేదు. విత్తన వ్యాపారులు సిండికేట్‌గా మారితే రైతులకు ధర రావడానికి ఆస్కారం లేదు. కొన్ని గ్రామాల్లో విత్తన వ్యాపారుల నుంచి రైతులు బైబ్యాక్ అగ్రిమెంట్ చేసుకుంటున్నప్పటికీ పంట చేతికొచ్చే సమయంలో మార్కెట్ ధరను బట్టి రైతులు ఇష్టం వచ్చిన వారికి విక్రయిస్తుంటారు. ఎర్రజొన్న పంట సాగు చేసి ఇబ్బందులు పడే బదులు హైబ్రిడ్ మొక్కజొన్న లేదా సీడ్ మొక్కజొన్న సాగు చేస్తే ఆదాయం పుష్కలంగా వస్తుందని రైతులు భావించడంతో మొక్కజొన్న విస్తీర్ణం రాను రాను గణనీయంగా పెరుగుతుంది.

సీడ్ మొక్కజొన్నను సాగు చేస్తున్నాం

● ఇట్టెడి లింగారెడ్డి, రైతు, దేగాం



గత కొన్నేళ్లుగా నాలుగు ఎకరాల్లో ఎర్రజొన్న పంట సాగు చేస్తూ వచ్చాం. సీడ్ మొక్కజొన్నకు అధిక ధర రావడంతో రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాం. తమ గ్రామంలో సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగవుతుంది. ఎర్రజొన్న పంట కంటే దిగుబడి ఎక్కువ వస్తుండడం, ధర కూడా బాగా రావడంతో సీడ్ మొక్కజొన్నను సాగు చేస్తున్నాం. ఎకరానికి రూ.లక్ష 20వేల వరకు ఆదాయం వస్తుందని భావిస్తున్నాం.

కన్నులపండువగా సీతారాముల రథోత్సవం

● రథ ప్రతిష్ఠ, హోమానికి భారీగా తరలివచ్చిన భక్తులు

భక్తి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సీతారామ చంద్ర స్వామి సాప్తాహిక ధ్వజారోహణ తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాఘశుద్ధ పౌర్ణమి బుధవారం రాత్రి సీతా రాముల రథోత్సవం కన్నుల పండుగగా సాగిం ది. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు సుమిత్ శర్మ దేశ్ పాండే ఆధ్వర్యంలో రథోత్సవానికి ముందు నిత్యహోమం, బలిహరణం, రథ ప్రతిష్ఠ, కార్యక్రమాల ను అత్యంత వైభవంగా నిర్వహిం చారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జంగం శాంతయ్య ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్ గడ్డం నర్సా రెడ్డి, సున్నం పోశెట్టి, సురా మాధురి, ఆసాది జీతేందర్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు అమృతాపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, శాంసన్, కంచెట్టి గంగాధర్, డా.షాదుల్లా, సుదర్శన్, నర్సరెడ్డి, సుద్దులం సాయి రెడ్డి, సాంపల్లి నర్సయ్య, ఆలయ ధర్మకర్త రాందాస్, సొసైటీ మాజీ చైర్మన్ జైపాల్, గ్రామ ప్రతినిధులు, తదితరులు పాలు పంచుకున్నారు.



రథోత్సవం సందర్భంగా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రామనామ స్మరణతో మార్మోగిన ప్రధాన వీధులు

చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో రథో త్సవం పురస్కరిం చుకొని సీతారాముల విగ్రహాలను రథాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి ప్రధాన వీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. రామ నామ స్మరంతో ప్రధాన వీధులు మార్మోగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు.



రథోత్సవం తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

రథోత్సవ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్

ఖిల్లా రామాలయ సీతరామ చంద్ర స్వామి రథోత్సవ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులచారి, హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆయన మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు వనవిహారం(జాతర)

నేడు సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వన విహారం, జాతర, చక్రతీర్థం కార్యక్ర మాలను అంగడీ మామూళ్లలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య తెలిపారు. జాతర కార్యక్రమానికి ఇప్పటికే దుకాణ సముదాయాలు వెలిశాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ నిల్

● నేటితో ముగియనున్న గడువు

కరీంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగియనుం దని, బుధవారం అభ్యర్థులెవరూ ఉపసంహరించుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని, పరిశీలనలో 32 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని, 68మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైందని, 16 మంది నామినేషన్లు సరిగా ఉన్నట్లు ప్రకటించామని పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముగియనున్నట్లు వెల్లడించారు.

నేడు రాంపూర్‌లో భేటీ బచావో భేటీ పడావో

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేడు ఉదయం 11 గంటలకు భేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బుజ్జి తెలిపారు. పాఠశాలలో నిర్వహించే ఈ కార్యక్ర మానికి అంగన్ వాడీ సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్‌లు అందజేస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం

బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్ శిక్షణతో మంచి ఉపాధి: ఆర్‌ఎం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మార్కెట్‌లో మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్‌కు మంచి డిమాండ్ ఉందని శిక్షణ నేర్చుకున్న వారంత తామ కాళ్లపై తాము నిలబడి ఆర్థికంగా ఎదిగే ఆవకాశం ఉందని అందుకు ఎస్‌బీఐ రుణ సహాయం చేస్తుందని ఎస్‌బీఐ రిజినల్ మేనేజర్ మహేశ్వర్ అన్నారు. బుధవారం డిచ్‌పల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియ గ్రామీణ స్వయం ఉపాధిశిక్షణ సంస్థ కేంద్రంఓ మగ్గం వర్క్, బ్యూటీపార్లర్ శిక్షణ పూర్తి అయిన వారికి సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ రెండు శిక్షణలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద నేర్చుకుంటే ఖర్చులు అధికమయ్యేవవని ఎస్‌బీఐ శిక్షణ ద్వార ఉచితంగా శిక్షణతో పాటు వసతి తమ బ్యాంకు చేదోడు వాదోడుగు నిలుస్తుందన్నారు. అభ్యర్థులకు సర్టిఫికేట్‌లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మీ, ఈశ్వరి, సుజాత, లక్ష్మన్ రాజు, పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులతో ఆర్‌ఎం, డైరెక్టర్



టీయూలో రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల ఐక్యతా రాగం

వర్సిటీల స్వయం ప్రతిపత్తిని రద్దు చేయడానికే యూజీసీ ముసాయిదా

● టీయూ విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో అసిస్టెంట్ ప్రొ.పున్నయ్య

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నూతన ముసాయిదా యూజీసీ అమలు చేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నాయని యూజీసీలో పెడరల్ స్ఫూర్తికి సైంటిఫిక్ టెంపర్‌కు వ్యతిరేకంగా విద్యా వ్యవస్థలో మార్పులు చేస్తున్నరని నూతన మూసాయిదా అమలు చేస్తే వర్సిటీలు స్వయం ప్రతిపత్తి కొల్పోవల్సివస్తుందని టీయూ అసిస్టెంట్ ప్రొ.పున్నయ్య అన్నారు. బుధవారం తెలంగాణ వర్సిటీలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పున్నయ్య మాట్లాడుతూ విద్యావ్యవస్థలో మార్పులు చేస్తున్నారని రాష్ట్రాల పరిధిలోని వర్సిటీల నిర్వహణ, నియామకాలు చేపట్టే ప్రక్రియ కేంద్రం ప్రభుత్వం యూజీసీకి అప్పగిస్తుందని దీంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్యా దూరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకులంగా ఉండే విధానాలను, సిలబస్‌ను ప్రవేశపెడుతుందని పీహెచ్‌డీ ప్రవేశాలకు ఇది వరకే సెట్ తొలగించిన పరిస్థితి ఉందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, పీడీఎస్‌యూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, ప్రిన్స్, రాకేశ్, హుస్సేన్, ఆకాశ్, దినేశ్, దేవిక, ఎస్‌ఎఫ్‌ఐ పృథ్వీ రాజు, ఎన్‌ఎస్‌యూఐ సాగర్ నాయక్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజును జాతీయ సెలవుదినంగా ప్రకటించాలి

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి రోజును జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని, లంబాడ సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు జాదవ్ ప్రవీణ్ నాయక్ అన్నారు. బుధవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబాడాల ఆరాధ్య దైవం అయినటువంటి సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల అభివృద్ధి కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అని అలాంటి గొప్ప చరిత్ర కలిగిన సేవాలాల్ మహరాజ్ సేవలను గుర్తించి ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు.

కమనీయంగా బ్రహ్మంగారి కల్యాణం

● స్వామివారిని దర్శించుకున్న భక్తులు



వీర బ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కమ్మర్‌పల్లి ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని శ్రీగిరి గుట్టపై సతీసమేతంగా కొలువుదీరిన కాలజ్ఞాని శ్రీమద్ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబాల కల్యాణోత్సవం బుధవారం ఉదయం కమనీయంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మంగారి మఠం నుంచి వచ్చిన ప్రత్యేక పూజారులు ఆలయ అర్చకులు విశ్వజ్ఞ ఎస్‌ఆర్ అనీల్ ఆధ్వ ర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజ, స్వామి వారి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రోశ్చరణల మధ్య ఘనంగా నిర్వహించగా గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల మండలాలు, గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణాన్ని కనులార తిలకించారు. భక్తులు స్వామివారికి కట్న కానుకలు సమర్పించుకున్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గుట్టపై జాతరా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం వీడీసీ సభ్యులు త్రాగునీరు, నీడ తదితర ఏర్పాట్లు చేశారు. స్వామివారి కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమాల్లో వీడీసీ అధ్యక్షుడు బోగ రామస్వామి, కార్యదర్శి పార్శవు శ్రీకాంత్ , కోశాధికారి బుచ్చిచల్లయ్య, పాలకవర్గ సభ్యులు సామ కపిల్, ప్రసాద్, సాకలి బాజన్న, సత్యపాల్, సుంకెట శ్రీనివాస్, రాజారాం, బెజ్జం గంగాధర్, కొత్తపల్లి గణేష్, గంగ నర్సయ్య, గుండోజి రమేష్ తదితరులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, కమ్మర్‌పల్లి ఎస్సై అనీల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

పాలెంలో ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జాతర

మోర్తాడ్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జాతర అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం ప్రారంభమైన ఆలయ ఉత్సవాలు బుధవారం ముగిశాయి. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో 24వ స్వామివారి జాతరను జరిపారు. రెండు రోజులుగా మహిళలు ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించారు. బుధవారం స్వామివారికి యజ్ఞం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత వైభవంగా జరిగిన జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్



మాజీ ఉపాధ్యక్షుడు తొగుట శ్రీనివాస్ దంపతులు పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో సంఘ సభ్యులు భూమేశ్వర్, మురళీ, గంగాధర్, నారాయణ, కిషన్, ముత్యం, ప్రభాకర్, గద్దె శ్రీనివాస్, దేవన్న, వెంకటరమణ, అరుణ్, శ్రీకాంత్, మహిళలు పాల్గొన్నారు.



ధర్మారం(బి) వేంకటేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

వేంకటేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ధర్మారం (బి) వేంకటేశ్వర ఆలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రాహుల్ త్రిపాటి, నిర్వాహకులు బ్రహ్మానందం, సుబ్బారావు, నాగార్జున, నాయుడు అంజనేయులు, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బంగారు వెంకన్న కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముప్కాల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో బుధవారం బంగారు వెంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఉత్సవమూర్తులకు అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, దేవత మవనము, హోమం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా ముత్యాల తలంబ్రాలతో బంగారు వెంకన్న కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణాలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి నాగవెళ్లి నిర్వహించారు. బంగారు వెంకన్నస్వామి కల్యాణం తిలకించడానికి ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం మూడో రోజు స్వామివారికి బలిహరణం, తీర్థప్రసాద వితరణ నిర్వహించ నున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

AJC CLASSIFIEDS

CHANGE OF NAME
I, CIKOTI RAJESH GOUD (OLD NAME) R/O H.NO: 5-22, NAVIPET, DHARYAPUR, NIZAMABAD, T.S. I HAVE CHANGED MY NAME AS CIKOTI RAJESH (NEW NAME) S/O CIKOTI GANGADHAR GOUD
AJZ

PASSPORT MISSING
I, SANJAYNI DAMA D/O DAMA SRINIVAS 2-92/1, MUBARAKNAGAR, MUBARAKNAGAR, NIZAMABAD RURAL, NIZAMABAD, T.G. HAVE LOST MY ORIGINAL PASSPORT (PASSPORT NUMBER (R0121879) WHILE SHIFTING OF OUR HOUSE IN MUBARAKNAGAR AREA FOUND, PLEASE CONTACT -8096908374
AJZ

CHANGE OF NAME
I, KOTTAKONDA MAHESH (OLD NAME) H.NO.5-109, (VI) SIRPUR, (M) MALLAPUR, DIST. JAGITYAL, T.G, HAVE CHANGED MY NAME AS KOTHA KONDA MAHESH S/O KOTTAKONDA LAXMIRAJAM (NEW NAME)
AJZ

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజూ... క్లాసిఫైడ్స్
ప్రతి 4 లైన్లకు 190/- అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453

సజ్జన్‌పల్లిలో మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా



సజ్జన్‌పల్లిలో మద్యం విక్రయించవద్దని తీర్మానిస్తున్న గ్రామస్తులు

లింగంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని సజ్జన్‌పల్లిలో మద్యం విక్రయిస్తే రూ.1లక్ష జరిమాన విధిస్తామని గ్రామస్తులు బుధవారం తీర్మానం చేశారు. గ్రామంలోని యువకులు మద్యానికి బానిసలుగా మారి పనులు చేయకుండా ఘర్షనలు పడుతూ జీవితాలను వృధా చేసుకుంటున్నారని, గ్రామంలో ఘర్షనలు, జూదంతో పాటు ఇతర అసాంఘీక కార్యకలాపాలకు మద్యమే కారణమని మద్యాన్ని గ్రామంలో విక్రయించవద్దని గ్రామస్తులంతా ఏకగ్రీవంగా తీర్మాణించారు. ఎవరైనా ఒప్పందం మీరితే వారికి రూ.1లక్ష జరిమాన విధిస్తామని దానితో పాటు గ్రామస్తులే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించి కేసులు చేయిస్తారని వారు తెలియజేశారు.

15న జాతీయ సెలవుదినంగా ప్రకటించాలి



ఢిల్లీలోని జంతరమంతర్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భారీ మహాధర్నాను గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు రాష్ట్ర ఉపాధ్యాక్షుడు వినోద్‌నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సద్గురు సేవాలాల్ మహారాజ్ యొక్క జయంతి ఫిబ్రవరి 15న జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని, కేంద్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మహాధర్నా చేపట్టామని తెలిపారు. భారత్‌లో బంజారాల జనాభా 16 కోట్లు అని తెలంగాణలో 40లక్షలు ఉన్నారని అన్నారు. గోరిబోలి భాషను భారతరాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యుల్‌లో చేర్చిఅధికారిక భాషగా గుర్తించాలని,టీటీడీలో గిరిజనులకు పదవులు ఇవ్వాలని, సేవాలాల్ మహరాజ్ ఫోటోను సెంట్రల్ పార్లమెంట్ పెట్టాని డిమాండ్ చేస్తున్నామన్నారు.

నల్లమడుగులో డ్రైనేజీ పనుల ప్రారంభం



నల్లమడుగులో డ్రైనేజీపనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

లింగంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని నలమడుగు గ్రామంలో బుధవారం రూ.20లక్షలో డ్రైనేజి పనులను కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ ప్రారంభించారు. గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజిపనులు గతంలో మద్యంలో నిలిచిపోయాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి వెంటనే రూ. 20లక్షలు మంజూరు చేశారని ఆయన తెలిపారు. పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, ప్రశాంత్, సాయిలు, సతీష్‌లు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు



మాచాపూర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సాయిబాబా

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ మండల పార్టీఅధ్యక్షుడు కురుమ సాయిబాబ అన్నారు. ఆయన బుధవారం ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్‌లో ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అనంతరం మల్లాయిపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గ్రామాలలో ప్రతీ ఇంటికి కాంగ్రెస్ కార్యకర్తలు చేరవేయాలని ఆయన కోరారు. ఏదైనా సమస్య ఉంటే కార్యకర్తలు గ్రామాలలో తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రజితవెంకట్‌రెడ్డి, మాజి మున్సిపల్ చైర్మన్ సత్యానారాయణ, మాజి సర్పంచ్ నారాయణ, మాజి జెడ్పీటీసీ సామెల్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

విద్యారంగాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్రకార్యదర్శి సురేష్

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 2 సంవత్సరాలు కావస్తున్న విద్యారంగాన్ని మాత్రం విస్మరించిందని పీడీఎస్‌యూ రాష్టకార్యదర్శి సురేష్ అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి కనీసం ఓ ప్రత్యేకశాఖను నియమించకుండా జాప్యం చేస్తు కేసీఆర్ అడుగుజాడల్లోనే రేవంత్‌రెడ్డి ప్రయాణం చేస్తున్నాడని అన్నారు. ఒకపక్క గురుకుల విద్యాలయాలలో ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తుంటే మరోపక్క విద్యాసంస్థలన్నింటిలో అరకొరసౌకర్యాలు, అధ్యాపకుల లేమి,మంచినీరు సమస్యసరిపోని తరగతి గదులు, శిథిలవస్థలో బిల్డింగులు, అద్దెభవనాల్లో విద్యాసంస్థల నిర్వహణ లాంటి లోపాలతో విద్యాసంస్థలు కొట్టుమిట్లాడుతున్నాయని అన్నారు.వెంటనే విద్యాపరమైన సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, శ్రీకాంత్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులందరికీ రైతు భరోసా అందజేస్తుంది



దోమకొండలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దోమకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతు భరోసాకు 8541 మంది అర్హులుగా ఉన్నారని, ఎకరాకు రూ. 6 వేల చోప్పున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పథకాల పట్ల వివరించడం జరుగుతుందన్నారు. 8541 మంది రైతులకు సబంధించి 6909 ఎకరాలకు రూ. 8 కోట్ల 29 లక్షల11329 రైతుల ఖాతాలలో జమ చేయబడుతుందని అన్నారు. ఇప్పటి వరకు రెండు ఎకరాల వరకు ఉన్న రైతులకు వారి ఖాతాల్లో రైతు భరోసా జమ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం మిగతా రైతులందరికి కూడా త్వరలోనే రైతు భరోసాను జమ చేస్తుందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులచే ప్రభుత్వం ఎంపిక చేసిన భూములకు రైతు భరోసా అందజేయడం జరుగుతుందని రైతులు దిగులు చెందవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కదిరే గోపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి,దోమకొండ పట్టణ అద్యక్షుడు సీతారాం మధు, సంగమేశ్వర్ గ్రామ అద్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డైరీ అద్యక్షుడు నరేష్, నేతుల సుధాకర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పార్కింగ్ చేసిన వాహనాల తరలింపు



వాహనాలను తరలిస్తున్న సీఐ,ట్రాఫిక్ ఎస్‌ఐ

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్టేషన్‌రోడ్డు, సుభాష్‌రోడ్డు, సిరిసిల్లరోడ్డు,ఎన్‌హెచ్- 7 రోడ్డుపై విచ్చలవిడిగా పార్కింగ్ చేసిన వాహనాలను స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం జరిమానా విధించడం జరిగిందని అక్రమంగా రోడ్డును ఆక్రమించి రోడ్డులపై షాపులకు సంబంధించిన బోర్డులను పెట్టిన వారికి, చిరువ్యాపారులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆక్రమణలను తొలగించామని తెలిపారు. మొత్తం 24 వాహనాలను సీజ్‌చేసిచలన్‌లు విధించామని ట్రాఫిక్ రూల్స్, ఆక్రమణలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ మహేష్‌సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరులో విద్యుత్ ఎంప్లాయిస్

యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



భిక్కనూరులో జెండా ఎగురవేస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యుత్ ఉద్యోగులు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా సబ్‌స్టేషన్ ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పడి 75సంవత్సరాలు పూర్తి కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ప్రభాకర్, ఆంజనేయులు, బాల్‌రాజు, మాణిక్యం, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష కోసం

విద్యార్థులకు మోడల్ పరీక్ష



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : టీజీ గురుకుల సెట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల కోసం ఈనెల 16న పట్టణంలోని సాయికీర్తి జూనియర్ కళాశాలలో ఉదయం 10గంటలకు మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏఎస్ఆర్ ఫౌండేషన్ నాయకులు కల్లూరి రాజారాం తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శనివారం లోపు మాదిరి పరీక్ష కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 736965601 నెంబరుకు సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాకుడు అయ్యాల సంతోష్ , కుమ్మరి సాయికుమార్ , పర్వయ్య తదితరులున్నారు.

ఇంట్లో చోరీ చేసిన వ్యక్తి అరెస్టు

● 9తులాల బంగారు ఆభరణాలు, 15వేల నగదు స్వాధీనం

ఖిల్లా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆరవటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఆటోనగర్‌కు చెందిన లెక్చరర్ ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని 6వ టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్ తెలిపారు. వివరాలను బుధవారం ఆయన చాంబర్‌లో ఎస్‌ఐ వెంకట్‌రావు తో కలిసి వెల్లడించారు. లెక్చరర్‌గా పనిచేసే ఇలియాజ్ అనే వ్యక్తి ఇంట్లో ఈనెల 7వ తేదీన ఆటోనగర్‌కు చెందిన అప్జాల్ షేక్ అన్వర్ అనే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. బాదితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం అర్సపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా స్కూటీపై అనుమానాస్పదంగా వెళ్తున్న అన్వర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. ఈ విచారణలో తాను జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నట్లు నేరం అంగీకరించడంతో అతని వద్ద 9 తులాల బంగారు ఆభరణాలు, 15వేల నగదుతోపాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సర్దాపూర్ తండాలో వైద్యశిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాచారెడ్డి,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్దాపూర్ తండాలో వైద్యశిబిరం నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ఆదర్శ్ తెలిపారు. ఈ శిబిరంలో 41 మందిని పరీక్షించి 7 గురి నుంచి రక్తనమునాలు సేకరించినట్లు తెలిపారు. ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఏదైన ఆరోగ్య సమస్యలు తలెత్తితే పీహెచ్‌సీకి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాధిక, మౌనిక సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలందరూ వైద్యసిబ్బంది సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా సిబ్బంది, మాచారెడ్డి పీహెచ్‌సీ సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులో పడి రైతు మృతి

నిజాంసాగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి చెందిన సంఘటన నిజాంసాగర్ మండలం వడ్డేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం గ్రామానికి చెందిన కంత్రపల్లి బాలయ్య (56) అనే రైతు తన పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. కాలువలో నీళ్లు రాకపోవడంతో పాపేశ్వరుని కుంట తూము వద్దకు వెళ్లి కాలువను శుభ్రపరుస్తుండగా కాలుజారి కుంటలో పడి మృతి చెందాడు. మృతుడికి మూడు ఎకరాల భూమి ఉంది. పొలంలో ఉన్న బోరు అడుగంటడంతో స్థానికంగా ఉన్న కాలువ ద్వారా పంటను కాపాడుకునేందుకు రైతు ప్రయత్నించాడు. బాలయ్య దివ్యాంగుడు అయినప్పటికీ అందరితో కలిసిమెలసి ఉండేవాడని స్థానికులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కొడుకు రమేష్ ఫిర్యాదు మేరకు నిజాంసాగర్ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అండర్-14 తైక్వాండోలో పాఠశాల విద్యార్థి ప్రతిభ

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వినాయక్‌నగర్‌లోని పాఠశాల దిస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఈగ రూపేష్‌రెడ్డి అండర్-14 తైక్వాండో జిల్లాస్థాయి పోటీలలో సత్తా చాటి వెండి పతకాన్ని సాధించారు. చదువుతో పాటు తైక్వాండోలో రాణిస్తున్న రూపేష్‌రెడ్డిని పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపక బృందం అభినం దించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

రాజంపేట,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల పౌర్ణమి రోజున ఆలయంలో ఈ కార్యక్రమం చేపడుతామని అన్నారు. అన్నదాన కార్యక్రమం కుల కుంట్లరాములు చంద్రకళ కుటుంబసభ్యులు చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

మున్నూరుకాపు సంఘ సభ్యుల ముందస్తు అరెస్టు



భిక్కనూరులో మున్నూరుకాపు సంఘం సభ్యులను అదుపులోకి తీసుకున్న దృశ్యం

భిక్కనూరు,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):కులగ ణలో మున్నూరుకాపు జనాభాను తక్కువగా చూపించారని ఆరోపిస్తూ చేపట్టిన ఛలో హైదరా బాద్ కార్యక్రమ నేపథ్యంలో భిక్కనూరు మండలం లోని మున్నూరుకాపు సంఘాల ప్రతినిధులను బుధవారం తెల్లవారుజామున ముందస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కుతరలించారు.ఈసందర్భంగారమేష్, బాల్‌రాజు, శ్రీనివాస్ మాట్లాడుతూ కు లగణలో తమ సామాజిక వర్గాన్ని తక్కువ చూపించడం ఎందుకని ప్రశ్నించారు. ఇలాంటి అక్రమ అరెస్ట్‌లకు భయపడేది లేదనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మునూరుకాపు నాయకులున్నారు

గడువు తీరిన మందులను విక్రయిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో

రాజంపేట,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గడువు తీరిన మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయఅధికారిని శృతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె పరిశీలించారు. రైతులకు అమ్ముతున్న మందులవివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లలో నమోదుచేయాలని రైతుకు ఖచ్చితంగా రసిదులు ఇవ్వాలని తెలిపారు. గడువు ముగిసిన మందులను రైతులకు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇళ్ల స్థలాల పరిశీలన



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

గాంధారి,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):గాంధారి మండల కేంద్రంలో సీపీఎం పార్టీ నాయకులు బుధవారం ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాయంలో 108 మంది ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. కాని ఇళ్లు నిర్మించి ఇవ్వకపోవడంతో అర్హులైన వారందరు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఇతర వసతులు కూడా కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోతిరాంనాయక్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

19న శోభాయాత్రను విజయవంతం చేయాలి

● హిందూవాహిని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మన్



సమావేశంలో మాట్లాడుతున్న హిందువాహిని రాష్ట్రకార్యదర్శి లక్ష్మన్

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఈనెల 19 న నిర్వహించే భారీ శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూవాహిని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మన్ అన్నారు. బుధవారం కామారెడ్డి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీక్లిమార్కెట్ నుంచి ఆర్యక్షత్రియ సంఘం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా సంయోజక్ సాయికిరణ్, నగర సంయోజక్ మదన్, జిల్లా ఆర్థిక టోలిప్రముఖ్ గోపాల్, ప్రచారసంఘం సభ్యులు హరిష్, దినేష్, సాయి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు నామాల ఆజాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, పాఠశాల విద్యలో 5, 8వ తరగతులకు డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని కాపాడాలని, అమెరికాలో భారత పౌరులపై ట్రంప్ దుశ్చర్యలను ఖండించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మమత, నగేష్, నసీర్, సృజన్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాల పరిశీలన



రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌పీ

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలను ఏఎస్‌పీ చైతన్యరెడ్డి బుధవారం పరిశీలించారు. గత సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఎన్ని ప్రమాదాలు జరిగాయనే దానితో పాటు ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రామన్, ఎస్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
శాంతి	- పట్టుదల
దర్శన్	- పుష్ప-2
ప్రియా 70	- ఒక పథకం ప్రకారం
ప్రియా 35	- తండేల్

బాన్సువాడ	
మహేశ్వరి	- సంక్రాంతికి వస్తున్నాం
వెంకటేశ్వర	- డాకు మహారాజ్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	180	210

